






హైదరాబాద్ వార్త


# గోల్కొండపై తొలి బోనం

- ఆషాఢ బోనాలకు వెల్లువలా తరలిన భక్తజనం
- జగదాంబిక ఎల్లమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రులు
- శివసత్తుల పూనకాలు..పోతరాజుల విన్యాసాలు..నృత్య బృందాలతో ఊరేగింపు
- లోయర్ ట్యాంక్‌బండ్‌లోని శ్రీ కనకాల కట్టమైసమ్మకు కుమ్మరుల బోనాల వేడుకలు





హైదరాబాద్, జూన్ 26 ప్రభాతవార్త

భక్తులతో గోల్కొండ కోటకిట కిటలాడింది. చారిత్రాత్మక గోల్కొండ కోటపై వెలసిన జగదాంబిక ఎల్లమ్మ ఆలయంలో జరిగిన తొలి బోనంతో ఆషాడ మాసం బోనాల ఉత్సవాలకు తెరలేచింది. అంతటా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవారి ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలు గురువారం కన్నుల పండువగా ప్రారంభమయ్యాయి. పోతరాజులు, నృత్య బృందాలతో పాటు తొట్టెల ఊరేగింపుతో గోల్కొండ కోటకు ఉత్సాహభరితమైన ర్యాలీ నిర్వహించారు. గోల్కొండ పూజారి ఇంటి వద్ద ఉత్సవ విగ్రహాలను ఆభరణాలతో అలకరించిన తర్వాత గోల్కొండ కోటపై ఉన్న ఆలయం వరకు ఊరేగింపు కొనసాగింది. అక్కడ తొట్టెల సమర్పరణతో మొదట బోనం పూజ ముగిసింది. ఉత్సవాల్లో ప్రభుత్వం తరపున శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ అధికారులు పాల్గొని బోనాలకు అధికారికంగా ప్రారంభం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత అమ్మవారికి బోనం సమర్పించారు.భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో మధ్యాహ్నం 12 గంటల నుంచి కోట జనసంద్రాన్ని తలపించింది. ఎల్లమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకునేందుకు మంది మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో తలలపై బోనాలతో మెట్లపై నుంచి కోటపైకి వెళ్లారు. ఒకేసారి భారీ సంఖ్యలో మహిళలు ఇలా వెళ్లిన దృశ్యం ఆకట్టుకుంది. కళాబృందాల నృత్యాలు,.శివసత్తుల పూనకాలు.. పోతరాజుల విన్యాసాలు అలరించాయి. అలాగే. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని శ్రీ కనకాల కట్టమైసమ్మకు కుమ్మరులు బోనాలను సమర్పించారు.



## ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు పెరగాలి

**-వైద్యులు సమయపాలన పాటించాలి**

**-జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి**



ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన దాసరి

హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:

ప్రభుత్వ ఆసుపత్రులలో సాధారణ ప్రసవాలు ఎక్కువగా జరగాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం గోల్కొండ ఏరియా ఆసుపత్రి, కుమ్మరి వాడలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలో గర్భిణీలు, బాలింతలు, పిల్లలు, వృద్ధులకు మెరుగైన వైద్య సేవలు అందాలని ఆదేశించారు. అన్ని ఏరియా ఆసుపత్రులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మందులు కొరత లేకుండా చూడాలని అలాగే వైద్యులు సమయపాలన పాటించాలని సూచించారు. కుమ్మరి వాడి పీహెచ్సీలో ఓ పి రిజిస్టర్, హాజరు రిజిస్టర్ పరిశీలించి వచ్చే ఓపి వివరాలు తెలుసుకున్నారు. గర్భవతులకు ఆహార నియమాలు వివరించాలని అలాగే ఆస్పత్రి ఆవరణలో గల యోగ రూమ్ లో గర్భిణీలు, వృద్ధులు, పక్షవాతంతో ఉన్నవారికి యోగా ఆసనాలు చేపట్టాలని సూచించారు. ఆస్పత్రి ఆవరణలో వర్షపు నీటి నిలువలను సత్వరమే తొలగించాలని సూచించారు. వర్షాకాలం కావడంతో మలేరియా డెంగ్యూ వ్యాధులు ప్రబలకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య అధికారులను సూచించారు. వచ్చిన పేషెంట్లతో అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరిచందన మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత కల్పిస్తుందని అన్నారు. వచ్చే రోగుల పట్ల నిరక్ష్యం చూపొద్దని సూచించారు. ఏరియా ఆసుపత్రిలోని సర్జికల్ ఓపి, కంటి ఓపి, డెంటల్ ఓపి, చిన్నపిల్లల ఓపి, ప్రసూతి ప్రసవాల గది, అలాగే ఎక్స్ రే, ఈసీజీ గదులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఏరియా ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య 120 కి పైగా ఉండటంతో అభినందిస్తూ సాధారణ ప్రసవాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని అలాగే వచ్చే గర్భిణీలకు, బాలింతలకు, పసి పిల్లలకు మెరుగైన వైద్య సేవలు అందాలని సూచించారు. ముఖ్యంగా ఓ పి సంఖ్య దాదాపు 600 వరకు ఉండటంతో స్వచ్ఛమైన త్రాగునీటిని నిరంతరం ఉండేలా చూడాలని ఆమె ఆదేశించారు.

అలాగే ఏరియా ఆసుపత్రి దగ్గరలో ఉన్నందున బోనాలు సందర్భంగా వచ్చే భక్తులకు ఆరోగ్య రీత్యా ఏమైనా సమస్యలు వస్తే సత్వరమే వైద్య సేవలు అందించాలని ఆమె సూచించారు. ఈ పర్యటనలో డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటి, ఏరియా ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ శ్రీనివాస్, అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ మురళీధర్ , డాక్టర్ ఆయేషా సుల్తానా, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీలో 22 అంశాలకు ఆమోదం



స్టాండింగ్ కమిటీ సమావేశంలోమ ఆట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ ఆర్.వి.కర్ణన్

హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:

నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం 4వ స్టాండింగ్ కమిటీ సమావేశం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూం లో జరిగింది. ఈసమావేశానికి కమిషనర్ ఆర్.వి కర్ణన్‌తోపాటు స్టాండింగ్ కమిటీ సభ్యులు, జిహెచ్ఎంసి అధికారులు హాజరయ్యారు. ఈసందర్భంగా కమిటీ సమావేశంలో 22 అంశాలు, 10 టేబుల్ ఐటమ్ లకు సభ్యులు ఆమోదించినట్లు మేయర్ తెలిపారు. ఇందులో ముఖ్యంగా వీధిలైట్ల నిర్వాహణ ఏజెన్సీల మార్పు, సోమాజిగూడ ఫ్లైఓవర్ కింద 2800మీటర్ల స్థలంలో సుందరీకరణ, రూ.598లక్షల వ్యయంతో ఎల్బీనగర్ -లింగోజిగూడ ప్రియదర్శినిపార్కు వరకు ఆర్‌సిసి పైప్‌లైన్‌తో స్మాట్‌వాటర్ డ్రెయిన్ నిర్మాణం, జిహెచ్ఎంసి ఆస్తులు సర్వే చేయడానికి హెచ్ఎండీఏ ద్వారా ఏఆర్‌సిజిఐఎస్ లాగిన్‌లు కొనుగోలు చేసేందుకు హెచ్ఎండీఏ కమిషనర్ 77.88లక్షలు చెల్లించుటకు ఆమోదం. అలాగే గచ్చిబౌలి జంక్షన్ వద్ద శిల్పాలేఅవుట్ -కొండాపూర్ వెళ్లే ఫ్లైఓవర్‌కు పిజెఆర్ పేరు పెట్టేందుకు కమిటీ ఆమోదం. అలాగే చార్మినార్ చంద్రాయణగుట్ట ఇన్నర్‌రింగ్‌రోడ్‌లో రూ.280లక్షల వ్యయంతో బాక్స్‌డ్రెయిన్ పనులకు అనుమతి. అన్నిజోన్‌లలో టాయిలెట్, ఇటాయిలెట్స్ ఉపయోగం కోసం పేఅండ్ యూస్ మెథడ్‌లో నిర్వాహణ ఇలా మొత్తం 22అంశాలకు కమిటీ ఆమోదం తెలిపింది. అలాగే ఇప్పటికే ఉన్న రూ.5బోజన కేంద్రాలను ఇందిరా క్యాంటిన్‌గా పేరుపెట్టడం ద్వారా పునరుద్దరించడం ఆల్పాహార పథకం ప్రారంభించడానికి ఆమోదంతోపాటు మరో 9 టెబుల్స్ ఐటెంలకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు బొంతు శ్రీదేవి, బానోతు సుజాత, సమీనా బేగం, అబ్దుల్ వాహెబ్, పర్వీన్ సుల్తానా, డా.ఆయేషా హుమేరా, మహమ్మద్ సలీం, బాత జబీన్, మహాలక్ష్మి రమన్ గౌడ్, మహమ్మద్ గౌస్ ఉద్దీన్, సి.ఎన్.రెడ్డి, వి.జగదీశ్వర్ గౌడ్, బూరుగడ్డ పుష్ప పాల్గొన్నారు.

## కారు బీభత్సం...పలువురికి గాయాలు

**అత్తాపూర్ జూన్26, ప్రభాతవార్త :**

ఓ కారు బీభత్సం సృష్టించిన ఘటన రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు వివరాల ప్రకా రం....సుమారు 3 కిలోమీటర్ల నుండి కారు డ్రైవర్ ఖలీము ద్దీన్ మద్యమత్తులో కారు అతీవేగంగా నడుపుతూ అడ్డువచ్చిన రెండు కార్లు, ఓ బస్‌ను ఢీకొట్టింది. అనంతరం అత్తాపూర్ లోని ఈశ్వర్ థియేటర్ సమీపంలో డివైడర్‌ను ఢీకొట్టి అగిపో యింది. ఈ ప్రమాదంలో పలువురికి స్వల్ప గాయాలు అయ్యా యి. కారు డ్రైవర్‌ను పట్టుకొని స్థానికులు చితకబాది పోలీసు లకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యా ప్తు చేస్తున్నారు.






## రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీఏ కార్యాలయాల్లో ఎసిబి దాడులు

**-పలువురి ఆర్టీఏ ఏజెంట్లు అదుపులోకి తీసుకున్న ఎసిబి**




ఉప్పల్ ఆర్టీఏ కార్యాలయం

**నాచారం, జూన్ 26 ప్రభాతవార్త :** తెలంగాణ వ్యాప్తంగా అవినీతి అధికారుల గుండెల్లో దడ పుట్టిస్తోంది ఏసీబీ గురువారం రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లోని 18 ఆర్టీఏ కార్యాలయాల్లో ఏసీబీ ఆకస్మిక తనిఖీలు చేస్తోంది. ఆర్టీఏ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతి బ్రోకర్ల చేతివాటం, మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ల సహకారం వంటి అంశాలపై ఏసీబీ అధికారులు ఈ దాడులను కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులు బ్రోకర్ల సిఫార్సు లేకుంటే అప్లికేషన్లు రిజెక్ట్ చేస్తున్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. పెద్దపల్లి, కామారెడ్డితో పాటు హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలోని ఉప్పల్, తిరుమలగిరి, మన్నెగూడలోని ఆర్టీఏ కార్యాలయాల్లో ఏసీబీ ఉదయం నుంచి సోదాలు చేస్తోంది. వివిద బృందాలుగా విడిపోయి కార్యాలయాలకు చేరుకొని ఏజెంట్లు చేస్తున్న దందాలను పసిగట్టి వారిని అదుపులోకి తీసుకున్నారు. ఆర్టీఏ కార్యాలయాల్లో గేట్లు మూసివేసి అందరిని బయటకు పంపించారు ఏసీబీ అధికారులు. హైదరాబాద్ ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ రంగారెడ్డి, జిల్లా డీఎస్పీ ఆనంద్ ఆధ్వర్యంలో అధికారులు పత్రాలను పరిశీలిస్తున్నారు. తిరుమలగిరి, ఉప్పల్ ఆర్టీఏ కార్యాలయంలో గత కొంతకాలంగా ఏజెంట్ల ఆగడాలు శృతిమించిన నేపథ్యంలో ఏసీబీ అధికారులు సుమోటోగా తీసుకొని సోదాలను నిర్వహిస్తున్నారు. ఏజెంట్లను ఏసీబీ అధికారులు విచారిస్తున్నారు. వారి నుండి సెల్ ఫోన్లు, ఇతరత్రా సమాచారాన్ని అధికారులు సేకరిస్తున్నారు. 18 మంది ఏజెంట్లు కార్యాలయంలో అక్రమంగా వాహనాల లైసెన్సుల జారీ విషయంలో కమిషన్లు తీసుకుంటూ అక్రమ దందాలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. సిబ్బందిని బయటికి పంపించి సోదాలు చేస్తున్నారు అధికారులు. రెండు బృందాలుగా రెండు కార్యాలయాల్లో ఏసీబి అధికారుల సోదాలు చేస్తున్నారు. రాత్రి వరకు ఈ సోదాలు కొనసాగిస్తూనే ఉన్నారు. ఏసీబీ దాడుల కారణంగా లైసెన్స్ కోసం వచ్చిన కార్యాలయాల ఎదుట గంటల తరబడి ఎదురు చూడాల్సి వచ్చింది. గత కొన్ని రోజులుగా ఏజెంట్లు ఆర్టీఏ ఆఫీసుల దగ్గర వాహన దారుల నుంచి భారీగా దోచుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ క్రమంలో ఆర్టీఏ కార్యాలయాల్లో ఏజెంట్ల ద్వార జరిగే అవినీతిపై ప్రత్యేక దృష్టి సారించిన ఏసీబీ ఏకకాలంలో వివిద ప్రాంతాల్లో తనిఖీలను చేపట్టింది. కాగా ఏజెంట్లపై పక్కా నిఘా ఉంచిన ఏసీబీ బృందాలు 20 మంది ఏజెంట్లను అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. ఏజెంట్ల నుండి నగదు, పలు వాహన ధ్రువీకరణ పత్రాలు, సెల్ ఫోన్లు, ఇతర డాక్యుమెంట్లు దొరికాయని ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. ఏజెంట్ల ఫోన్లను స్వాధీనం చేసుకొని అందులో ఉన్న సమాచారాన్ని తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. ఆర్టీవో సిబ్బందిపై కూడా పలు ఆరోపణలు ఉన్న నేపథ్యంలో వారిని కూడా విచారిస్తామని అన్నారు. ఆర్టీవోను కూడా అన్ని కోణాలలో విచారించి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. ఒక్కో ఏజెంట్ దగ్గర 50 వాహన దృవీకరణ పత్రాలు ఉన్నట్లు నిర్ధారణకు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. రాత్రి వరకు ఏసీబీ సోదాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# కరప్షన్ కింగ్‌లు

**-అవినీతికి కేరాఫ్ సరిల్క్-23 ఎసిపి, టిపిఎస్‌ల కార్యాలయాలు.. -అక్రమ నిర్మాణాల జోరు...బంగారు బాతుల్లా బిల్డర్లు**




**కూకట్‌పల్లి, జూన్ 26, ప్రభాతవార్త:**

మూసాపేట సర్కిల్ 23 అసిస్టెంట్ సిటీప్లానర్ (ఏసీపీ) టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ (టీపీఎస్)ల కార్యాలయాల్లో అవినీతి అక్రమ వసూళ్ళలో ఓ ఇద్దరు అధికారులు రికార్డులు సృష్టిస్తున్నారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని స్వయంగా జీహెచ్ఎంసి కమిషనర్ ఇస్తున్న ఆదేశాలను ఆ ఇద్దరు అధికారులు పట్టించుకోకుండా నీకింత నాకింత అంటూ అక్రమ నిర్మాణాలకు తమవంతు సహకారం అందిస్తూ జేబులు నింపుకుంటున్నారు. తీసుకున్న అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే సదరు భవనాల్ని కూల్చివేయవచ్చు. కెపిహెచ్‌బి కాలనీ, బాలాజీనగర్, మూసాపేట డివిజన్‌ల పరిధిలోని పలు ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా వెలుస్తున్న కమర్షియల్ భవనాలతోపాటు ఐదారు అంతస్తుల వరకు వెలుస్తున్న అక్రమ అపార్ట్‌మెంట్‌ల నిర్మాణాలకు సర్కిల్ 23 ఏసీపీతోపాటు కొందరు అధికారులు అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నట్లు సదరు అధికారులపై ఆరోపణలు వస్తున్నాయి. బిల్డర్లు ఓ వైపు నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా మరో వైపు తీసుకున్న అనుమతులకు విరుద్ధంగా నిబంధనలకు పాతరేసి అడ్డగోలుగా అనుమతులు సాధించి బహుళ అంతస్తుల భవనాల్ని బిల్డర్లు చక చకా నిర్మించేస్తున్నారు. పెద్దఎత్తున పెరుగుతున్న నిర్మాణాలకు అనుగుణంగా జీహెచ్ఎంసి ఆదాయం కూడా పెరుగాల్సి ఉంటుంది. అయితే టౌన్‌ప్లానింగ్ విభాగంలోని కొందరు అధికారులు చేతివాటానికి అలవాటుపడి ఆక్రమ నిర్మాణాలకు తమ వంతు సహకారం అందించి గ్రేటర్ ఆదాయానికి గండికొడుతున్నారు. ఆక్రమ నిర్మాణాలు చేపడితే, ముడుపులు అప్పగిస్తేనే అక్రమ నిర్మాణం సక్రమంగా కొనసాగుతుంది. భవన నిర్మాణాల అనుమతులకు ఓ రేటు ఆక్రమ నిర్మాణాలకు మరో రేటు వసూలు చేస్తున్న కొందరు అధికారులకు కమర్షియల్ భవనాలు కామధేనువులా మారి రూ. కోట్లు కురిపిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం అధికమవుతున్నది. సర్కిల్ 23 ఏసీపీ కార్యాలయంలో కీలక బాధ్యతల్ని నిర్వహిస్తున్న ఓ అధికారితో పాటు కెపిహెచ్‌బి కాలనీ, బాలాజీనగర్, మూసాపేట డివిజన్‌లలో విధులు నిర్వహిస్తున్న మరో అధికారి తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ బిల్డర్లు, అక్రమ నిర్మాణదారులకు తను వంతు సహకారం అందిస్తుండడంతో ఎక్కడ చూసినా అక్రమ నిర్మాణాలు కుప్పలు తెప్పలుగా వెలుస్తున్నాయి. భవన నిర్మాణాలపై నిత్య పర్యవేక్షణ చేయాల్సిన సర్కిల్ 23 టౌన్‌ప్లానింగ్ విభాగంలో కొందరు అధికారులు మామూళ్ళ మత్తులో మునిగి తేలుతున్నారు. అక్రమ నిర్మాణాలను పర్యవేక్షించే పట్టణ ప్రణాళిక విభాగంలోని కొందరు అధికారులు ఓ ధర నిర్ణయించి అక్రమ సంపాదనే లక్ష్యంగా సాగిపోతున్నారు. అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న సందర్భాలు రెండు రకాలుగా జరుగుతోంది. ఉన్నతా దికారులు ఆదేశాలు ఇవ్వడమో లేదా స్థానిక ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చి ఒత్తిడి రావడమో జరిగితేనే తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే కూల్చివేతలకు అదికారులు శ్రీకారం చుడుతున్నారు. ఇలా కూల్చివేయాల్సి వచ్చినప్పుడు రంధ్రాలు చేసి చేతులు దులుకుంటున్నారు. తర్వాత మామూళ్ళను ముట్టచెప్పి అక్రమ నిర్మాణదారులు తమ నిర్మాణాలను యధావిధిగా చేపడుతున్నారు. పలు ప్రాంతాల్లో ఇష్టారాజ్యంగా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలకు మూసాపేట సర్కిల్, సర్కిల్ 23 అధికారులు అవినీతే కారణమని ప్రజలు విమర్శిస్తున్నారు. అధికారుల ధన దాహం కారణంగానే అక్రమ అపార్‌మెంట్లు, నిర్మాణాలు పెద్దఎత్తున వెలిశాయి. జీహెచ్ఎంసి నిబంధనల్ని అతిక్రమించినా సరే కొందరు టౌన్‌ప్లానింగ్ అధికారులు నిర్ణయించిన ముడుపులు ముట్టచెబితే ఆక్రమ ఆపార్ట్‌మెంట్లు అయినా, నిర్మాణాలకయినా వెంటనే అధికారుల ఆమోద ముద్రపడుతుంది. దీన్ని బట్టి కొందరు టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు జేబులు నింపుకోవడానికి మాత్రమే పరిమితమవుతున్నారని అర్థమవుతుంది. అక్రమ కమర్శియల్ బహుళంతస్తుల నిర్మాణాలతోపాటు జీప్లస్ టూ వరకు అనుమతులు తీసుకొని ఐదారు అంతస్తులు నిర్మిస్తున్న అక్రమ నిర్మాణదారులతో పాటు బిల్టర్లతో కుమ్మకైన టౌన్‌ప్లానింగ్ అధికారులు కోట్లు దండుకుంటూ జేబులు నింపుకోవడానికే పరిమితం అయ్యారు.

## కళాబంధు సారిపల్లికు శతాబ్ది గాయకుడు ఘంటసాల ప్రత్యేక సంచిక



కొండలరావుకు శతాబ్ది గాయకుడు ఘంటసాల ప్రత్యేక సంచికను బహూకరిస్తున్న రఘురామ్, సత్యనారాయణ, సుబ్బారాయుడు, రాధాకృష్ణ తదితరులు

**నాంపల్లి, జూన్ 26 ప్రభాతవార్త :** ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ఎన్నో సాంస్కృతిక, కళాసంస్థలకు ఎన్నో ఏళ్లుగా అన్ని విషయాల్లో అండదండగా ఉండడమే కాకుండా 3 సంవత్సరాలుకుపైగా తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు. ఐఎఎస్ విశ్రాంత అధికారి డా. కె.వి.రమణాచారి చొరవ సలహామేరకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని జానపద కళాకారులకు నెలకు లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తూ దార్శనికతను చాటుకొంటున్న సాంస్కృతిక కళాబంధు సారిపల్లి కొండలరావుకు శతాబ్ది గాయకుడు ఘంటసాల ప్రత్యేక సంచికను బహూకరించారు. ఈమేరకు ప్రత్యేక సంచిక సంకలనకర్త చల్లా సుబ్బారాయుడు ప్రముఖ సాంస్కృతిక సంస్థల అధినేతలు మద్దాళి రఘురామ్, జి.సత్యనారాయణ, రాధాకృష్ణ తదితరులతో జన్మదినం జరుపుకొంటున్న కొండలరావును కలిసి విశ్వవిఖ్యాత గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 1945లో తొలిచిత్రం నుండి 1974వరకు పాడిన పాటలు, ఆయన సంగీత దర్శకత్వ సినిమాలు, భగవద్గీతతోపాటు పాటిన ప్రైవేట్ పాటల పూర్తి స్క్రిప్టు, ఆయా సినిమాల పోస్టర్లు, ఘంటసాల జీవిత విశేషాలతో 250కిపైగా ఫోటోలు, వెయ్యిపేజీలతో కూడిన శతాబ్ది గాయకుడు ఘంటసాల పుస్తకాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభించిన కార్పొరేటర్



సీసీ రోడ్డు పనులకు ప్రారంభించిన కార్పొరేటర్ కొలను లక్ష్మి

**సంజీవరెడ్డి నగర్ జూన్ 26 ప్రభాతవార్త:** సనత్ నగర్ డివిజన్‌లో గురువారం దాసారం బస్తీ నల్లపోచమ్మ దేవ స్థానం నుంచి అయ్యంగార్ బేకరీ వరకు,మాతా టెంట్‌హౌజ్ వెనుకాల గల్లీ వరకు రూ.31 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులను సనత్ నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మి బాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో శంకుస్థాపన చేసిన శ్రీకారం చుట్టారు. తలసాని హయాంలో ఎన్నో ఎసంక్షేమ పథకాలను అందించారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో సనత్ నగర్ డివిజన్ అధ్యక్షులు కొలను బాల్‌రెడ్డి, ఏఈ జమీల్, భాస్కర్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఖలీల్‌బేగ్,షాబాద్ శ్రీనివాస్, సి.నాగరాజు, విజయ్ సింగ్,నజీర్, పురుషోత్తం, విశ్వనాథ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## యదార్థ సంఘటనల నాటకీకరణ 27వ మైలురాయి



27వ మైలురాయి సందేశాత్మక నాటకంలో ఒక దృశ్యం

**రవీంద్రభారతి, జూన్ 26 ప్రభాతవార్త :** నిజం గెలుస్తుందన్న మాట వాస్తవమేనైనా గెలిచేదంతా నిజంకాదనే ప్రధానాంశంగా 27వ మైలురాయి నాటకం 1993లో జరిగిన యదార్ధ సంఘటనల నాటకీకరణ అన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి న్యాయవాదులు తమ దగ్గరకు వచ్చిన అన్ని కేసులు, సమాజానికి కీడుచేసే కేసులను వాదించకుండా ఉండడమే ఉత్తమం అనే సందేశాత్మకతతో వ్రాయబడిందని ఆయన అన్నారు. ప్రతీనెలా నాటకం.. ప్రేక్షకుడికి వినోదం, నటుడికి ఆనందం.. అదే మాబాట మాటనే ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసరంజని ఆధ్వర్యంలో నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో గురువారం రాత్రి పి.టి.మాధవ్ రచన; రౌతు వాసుదేవరావు దర్శకత్వంలో యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్ విజయవాడ వారి సమర్పణలో ఈ 27వ మైలురాయి సందేశాత్మక నాటకం అత్యంత అద్భుతంగా ప్రదర్శింపబడి నేటి పరిస్థితులను కళ్లకుకట్టించి ఎంతగానో మెప్పించింది. ప్రధానపాత్రల్లో నటరాజ్, సురభి ప్రభావతి, జాహ్నవి, పవన్‌కుమార్, వాసు, కిరణ్, వరప్రసాద్, మోహిత్ తదితరులు ఆయా పాత్రోచితంగా నటించి నాటక ప్రదర్శనకు విచ్చేసిన అధికసంఖ్యలో నాటకప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులను ఆకట్టుకొని హర్షధ్వానాల మధ్య ప్రశంసలందుకున్నారు. ఈ ప్రదర్శనను రసరంజని ప్రధాన కార్యవర్గ సభ్యులు డి.రామకోటేశ్వరరావు, మోహనసేనాపతి, కె.నటరాజ్ తదితరులు పర్యవేక్షించారు. చివరిగా నటీనటులను ఘనంగా సన్మానించారు.

## ఉచిత మెగా హెల్త్ క్యాంప్



**చార్మినార్. జూన్ 26 ప్రభాతవార్త**

పాతబస్తీ చార్మినార్ జి హెచ్ ఎం సి జోనల్ కార్యాలయం లో గురువారం ట్రయల్ బ్రే జిల్ ఇన్సూరెన్స్ బ్రేకింగ్ కంపెనీ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్ జరిగింది.బీపీ.షుగర్.కంటి.ఈసీజీ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో కంపెనీ ప్రతినిధులు సుమన్.రఘురామ్.డాక్టర్లు సి కాంత్.అబిద్ అలీ ఖాన్.వాసన్ ఐ కేర్ మార్కెటింగ్ మేనేజర్ నరేంద్రలు పాల్గొన్నారు.



చారిత్రక గోల్కొండ బోనాల వేడుకలో బోనం సమర్పించేందుకు వెళ్తున్న నార్సింగి మున్సిపల్ బిజెపీ సీనియర్ నాయకులు చిక్కిరి బిక్షపతి యాదవ్, శివరాజ్ తదితరుల దృశ్యం.

## రాష్ట్రంలో అంధులకు నాణ్యమైన విద్యను అందించడానికి గ్రంథాలయ వ్యవస్థ కీలకపాత్ర

**-రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మహ్మద్ డాక్టర్ రియాజ్**



ప్రత్యేక గ్రంథాలయ విభాగం'ను ప్రారంభిస్తున్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మహ్మద్ డాక్టర్ రియాజ్, చిత్రంలో సంస్థ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ కదిరవన్, కార్యదర్శి పొట్లూరి పద్మజ తదితరులు

**చిక్కడపల్లి, జూన్ 26 ప్రభాతవార్త:** రాష్ట్రంలో అంధులకు నాణ్యమైన విద్యను అందించడానికి గ్రంథాలయ వ్యవస్థ కీలకపాత్ర వహిస్తోందని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మహ్మద్ డాక్టర్ రియాజ్ అన్నారు. గురువారం అశోక్‌నగర్ నగర కేంద్ర గ్రంథాలయంలో 'జ్ఞానజ్యోతి" పేరుతో అంధుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్రంథాలయ విభాగం'ను నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేశిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ కదిరవన్, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పొట్లూరి పద్మజ, దేవనార్ అంధుల పాఠశాల అధినేత సాయిబాబాగౌడ్‌తో కలిసి లాంఛనంగా ప్రారంభించి ప్రసంగించారు.మహ్మద్ రియాజ్ మాట్లాడుతూ అంధుల విద్యాభివృద్ధికి గ్రంథాలయ వ్యవస్థ కీలకపాత్ర పోషిస్తోందని, జ్ఞానజ్యోతి లాంటి విభాగాలు సమానత్వానికి మార్గనిర్దేనం చేస్తాయన్నారు. కేసిరెడ్డి ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయంలో జ్ఞానజ్యోతి విభాగం ఏర్పాటుతో అంధులకు విద్యను అందించడంలో ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యోగులు చంద్రకళ, అవినాష్, వెంకటేశ్వర్ రెడ్డి, వెంకటేష్ యాదవ్, రామ్మోహన్, కృష్ణారెడ్డి, బొల్లం మహేందర్, ప్రతిభా రెడ్డి, మంజులవాణి, శ్రీకాంత్, మహేశ్వరి, దేవనారు స్కూల్ ఇన్‌చార్జ్ రామకృష్ణ విద్యార్థులు, ఉద్యోగస్తులు పాల్గొన్నారు

## అందరూ మెచ్చుకునేలా మన పనితీరుండాలి : ప్రత్యేక అధికారి శ్రీధర్

**పదోన్నతి పొందిన ఉద్యోగులకు ఘనంగా వీడ్కోలు**



పదోన్నతి పొంది ఇతర ప్రాంతాలకు వెళ్తున్న బండ్లగూడ కార్పోరేషన్ మేనేజర్ మంజులత, ఆర్ఓ. నసీర్లకు వీడ్కోలు తెలుపుతున్న ప్రత్యేక అధికారి శ్రీధర్ తదితరులు.

**నార్సింగి, జూన్ 26 ప్రభాతవార్త :** పదుగురు మెచ్చుకునేలా మన పనితీరు ఉండాలని బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ ప్రత్యేక అధికారి శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం బండ్లగూడ కార్పోరేషన్‌లో మేనేజర్‌గా పనిచేసిన మంజులత, ఆర్ఓగా పని చేసిన నసీర్లు పదోన్నతి పొంది బదిలీ అయ్యారు. వీరిద్దరికి ప్రత్యేక వీడ్కోలు సభ నిర్వహించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలో ప్రత్యేక అధికారి శ్రీధర్, రాష్ట్ర మున్సిపల్ కమీషనర్ల సంఘం అధ్యక్షులు కృష్ణమోహన్‌రెడ్డి, బండ్లగూడ కమిషనర్ శరత్ చంద్రలు పాల్గొని పదోన్నతిపై వెళ్తున్న అధికారులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంకిత భావంతో పనిచేసి, అప్పగించిన పనిని ఫలవంతం చేయాలన్నారు. మున్సిపాలిటీల్లో ప్రధానంగా పారిశుధ్య సమస్య, ఆస్థి పన్నుల వసూళ్ల ఉంటాయన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకొని వెనువెంటనే పరిష్కరించాలని, సకాలంలో ఆస్థిపన్నులు వసూలు చేసి మౌళిక వసతుల మెరుగుకు పాటుపడాలని సూచించారు. ప్రభుత్వ అధికారులకు బదిలీలు, పదోన్నతులు, పవీ విరమణలు సర్వ సాధారణమన్నారు. ఎక్కడ పని చేసినా, ఏ పని చేసినా మనదైన ప్రత్యేక ముద్ర ఉండేలా పని చేయాలని, పది కాలాల పాటు మనం చేసిన పనులను ప్రజలు చర్చించుకునేలా ఉండాలని పేర్కొన్నారు. అలాగే అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న డి.చంద్రశేఖర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది,పాల్గొన్నారు.

## అంబర్‌పేటలో 'లైవ్ న్యూడ్' వీడియోల వ్యాపారం

**-రెండు వేలు ఇస్తే ఆన్లైన్‌లో లైవ్ రొమాన్స్ లింక్**
**-టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి, దంపతుల అరెస్టు**

**హైదరాబాద్ జూన్ 26, ప్రభాతవార్త :** సమాజం ఎటు పోతుంది..డబ్బుల కోసం ఏమైనా చేస్తారా..ఎంత నీచమైనా పనులైనా చేస్తారా..ఇప్పటి వరకు డబ్బుల కోసం గొడవలు, మర్డర్లు జరగడం చూశాం. కానీ ఓ జంట ఏకంగా శీలాన్ని తాకట్టు పెట్టింది. డబ్బుల కోసం సభ్యసమాజం తలదించుకునే విధంగా తమ నగ్న వీడియోలను ఆన్‌లైన్లో అమ్మకానికి పెట్టి గలీజ్ దందాకు తెరలేపింది. ఇంట్లో నగ్న వీడియోలు రికార్డు చేసి వాటిని ఆన్‌లైన్‌లో డబ్బులకు అమ్ముతున్నారు. డబ్బులు ఎక్కువ ఇచ్చినవారికి ఏకంగా లైవ్ లింక్ పంపుతున్నారు. ఈ నీచపు ఘటన అంబర్‌పేటలో వెలుగులోకి వచ్చింది.. అంబర్‌పేట్‌లో ఇద్దరు దంపతులు వెర్రి చేష్టలకు పాల్పడ్డారు. తమ ఇంటి టెర్రస్‌ను అడ్డాగా చేసుకొని తమ ప్రైవేట్ వీడియోలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేస్తూ డబ్బులు సంపాదిస్తున్నారు. ఈ విషయం ఆ నోట ఈ నోట తెలిసి పోలీసుల వరకు వెళ్లింది.పక్కా ప్రణాళికతో నిర్వాహకుల్లా వ్యవహరిస్తూ, ఆన్ లైన్‌లో తమ వీడియోలు అప్లోడ్ చేస్తూ.. డబ్బు తీసుకుని ప్రజలకు లింక్ పంపుతున్న ఈ వ్యవహారం చివరకు టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడితో బట్టబయలైంది. ఈ దంపతులు గత నాలుగు నెలలుగా "స్వీటీ తెలుగు కపుల్ 2027" అనే పేరుతో ఇన్‌స్టాగ్రామ్, ఇతర ఆన్‌లైన్ ప్లాట్ ఫారమ్‌లలో తమ న్యూడ్ వీడియోలను ప్రచారం చేస్తున్నారు. దీంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగి దంపతులు ఉంటున్న ఇంటిని రైడ్ చేశారు. వీడియోలు చిత్రీకరిస్తున్న కెమెరాతో పాటు సామాగ్రిని స్వాధీనం చేసుకుని అంబర్‌పేట పోలీసులకు ఇద్దరినీ అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అతను గతంలో రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా పనిచేసేవాడు. ఇప్పుడు అందులో పెద్దగా డబ్బులు రాకపోవడంతో ఈ పాడు వ్యవహారానికి తెరలేపాడు. నాలుగు నెలల నుంచి తన భార్య తో గడుపుతున్న ప్రైవేట్ వీడియోలను కెమెరాలో చిత్రీకరించి వాటిని ఆన్లైన్లో వీక్షించే వినియోగదారులకు పేమెంట్ చెల్లిస్తేనే చూసే విధంగా వ్యాపారం మొదలుటపెట్టాడు. ఇన్‌స్టాగ్రామ్ పేజీలో లైవ్ స్ట్రీమింగ్‌ని సైతం ఏర్పాటు చేశారు. తమ వీడియోలను లైవ్ స్ట్రీమింగ్ చూడాలి అనుకునేవారు 2000 రూపాయలు చెల్లించాల్సిందిగా నిబంధన పెట్టి నాలుగు నెలలుగా ప్రతిరోజు ఈ తరహా వీడియోలు పోస్ట్ చేస్తున్నాడు. అయితే ఇది సాధారణ వీక్షకులు చూసేందుకు వీలు లేకుండా కేవలం ఎవరైతే డబ్బులు చెల్లిస్తారో వారు మాత్రమే ఈ వీడియోలను చూసే విధంగా ఏర్పాటు చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. కొడుకు బీటెక్ చదువుతుండగా.. కుమార్తె ఇంటర్ చదువుతున్నట్లు తెలిపారు. అయితే తమ తల్లిదండ్రులు చేస్తున్న ఈ బాగోతం పిల్లలకు తెలియదు అని పోలీసులు చెబుతున్నారు. వీరు చేస్తున్న వీడియోల బాగోతం స్థానిక వ్యక్తుల ద్వారా టాస్క్ ఫోర్స్ వారికి తెలియడంతో.. రంగంలోకి దిగి నిందితులను అదుపులోకి తీసుకుని అంబర్‌పేట్ పోలీసులకు అప్పగించారు.

## రైల్వేప్రయాణీకుల వస్తువుల దొంగ అరెస్ట్...అభరణాలు స్వాధీనం

**నాంపల్లి, జూన్ 26 ప్రభాతవార్త :** జీఆర్‌పి హైదరాబాద్ పరిధిలోని లింగంపల్లి రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఒక వ్యక్తిని పట్టుకొని తనిఖీలు నిర్వహించి నిందితుడి వద్ద సరైన రశీదులులేని 20లక్షల విలువచేసే 200 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకొని అదుపులోకి తీసుకున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే ఈరోజు గురువారం ఉదయం 7గంటల ప్రాంతంలో హైదరాబాద్‌లోని ఐఆర్‌పి బి.ప్రవీణ్‌కుమార్ తన సిబ్బంది ఆర్‌హెచ్‌సి నర్సింగ్ రాథోడ్, ఎ.శ్రీనివాస్, ఆర్‌సిపి షకీల్ పాషా, కె.శ్రీనివాస్, ఇస్మాయిల్ షరీఫ్‌లతో కలిసి ఆర్‌పిఎఫ్ సిబ్బంది లింగంపల్లి రైల్వేస్టేషన్‌లో అనుమానితుల కోసం సాధారణ తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదరీతిలో సంచరిస్తున్న ఒక వ్యక్తిని కనుగొన్నారు. అతడ్ని అదుపులోకి తీసుకుని విచారించగా పేరు బల్లాసాగర్ అనిల్‌కుమార్, తండ్రి ఇన్నయ్య, వయస్సు 32 సంవత్సరాలు, కమ్మ కులం, నివాసం చందానగర్, సురారం, కుతుబుల్లాపూర్, ఆర్.ఆర్.జిల్లా అని, నల్గొండ పట్టణంలోని లెప్రసీ హాస్పిటల్ సమీపంలోని ఎన్/ఓ అని వెల్లడించినట్లు చెప్పారు. అతని జేబులోని కవర్‌ను తెరచిచూడగా బంగారు ఆభరణాలున్నాయన్నారు. తనవద్దనున్న బంగారు ఆభరణాల విషయంలో సరైనపత్రాలు, సమాధానం ఇవ్వలేకపోయాడని చెప్పారు. నిందితుడిని ప్రశ్నించగా 24న సాయంత్రం చందానగర్ రైల్వేస్టేషన్ దాటిన తర్వాత లింగంపల్లి-కాకినాడ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలులోని బి-4 కోచ్‌లో ప్రయాణిస్తున్న ఒక ప్రయాణికుడి లగేజ్ బ్యాగ్‌ను దొంగిలించానని ఒప్పుకున్నాడు. ఆర్‌పిఎస్ హైదరాబాద్ కేసు నమోదుచేసి ఐఆర్‌పి హైదరాబాద్ ఇద్దరు పంచాల సమక్షంలో అతని ఒప్పుకోలు ప్రకటనను నమోదుచేసి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. స్వాధీనం చేసుకున్న వాటిలో 56.6 గ్రాముల రెండు వరుసల బంగారు మంగళసూత్రం చైన్; 89 గ్రాముల మూడుజతల బంగారు గాజులు; 25.56 గ్రాముల ఒక నల్లపూసల బంగారు గొలుసు; 21.57 గ్రాముల నల్లపూసల బంగారు గొలుసు; 6.97 గ్రాముల రాళ్లతో కూడిన ఒక జత బంగారు చెవిపోగులు మొత్తం బరువు సుమారు 200 గ్రాములు; వాటి విలువ సుమారు 20,00,000 రూపాయలని తెలిపారు.

సికిందరాబాద్ పోలీస్ సూపరిం టెండెంట్ రైల్వేస్ చందనదీప్తి ఐపిఎస్, డిఎస్ఆర్‌పి సికిందరాబాద్ అర్బన్ ఎస్.ఎన్.జాదవ్ పర్యవేక్షణలో ఐఆర్‌పి హైదరాబాద్ ప్రవీణ్‌కుమార్ ఐపిఎస్ లింగంపల్లి, సిబ్బందితో కలిసి నిందితుడిని అరెస్టు చేశారు. హైదరాబాద్‌లోని రైల్వేస్, రోడ్ సేఫ్టీ, టీజి హైదరాబాద్ ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కె.రమేష్‌నాయుడు, ఐపిఎస్ ఆర్పీఎస్ హైదరాబాద్ సంబంధిత అధికారులు, సిబ్బందిని అభినందించి, వారికి తగిన రివార్డులు అందజేయబడతాయని తెలిపారు.

## రైల్వే ఉద్యోగుల కుటుంబాల ఆరోగ్య సంరక్షణకు దక్షిణ మధ్యరైల్వే కృషి : జిఎం అరుణ్‌కుమార్ జైన్



లాలాగూడ సెంట్రల్ హాస్పిటల్లో కార్డియాక్ క్యాత్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న జీఎం అరుణ్‌కుమార్ జైన్ తదితరులు

**తార్నాక, జూన్ 26 ప్రభాతవార్త :** లాలాగూడ సెంట్రల్ హాస్పిటల్‌లో గురువారం కార్డియాక్ క్యాత్ ల్యాబ్, అడ్వాన్స్‌డ్ కార్డియాక్ యూనిట్‌ను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నిర్మలా రాజారాం, హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్, సెంట్రల్ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఐ.శివనాగ ప్రసాద్,సెంట్రల్ హాస్పిటల్ చీఫ్ స్టాఫ్ సర్జన్ 1 (కార్డియాలజిస్ట్) డాక్టర్ ఎన్వీబీకే సాయి, సెంట్రల్ హాస్పిటల్ చీఫ్ స్టాఫ్ సర్జన్ 2 డాక్టర్ కృష్ణవేణి, వివిధ శాఖలకు చెందిన ప్రధానాధిపతులు, ఇతర సీనియర్ అధికారులు, వైద్యులు ఆసుపత్రి సిబ్బంది, గుర్తింపు పొందిన ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులు, రిటైర్డ్ ఉద్యోగులు కూడా పాల్గొన్నారు. కాగా ఈ నూతన కార్డియాక్ క్యాత్ ల్యాబ్లో గుండె సంబంధిత యాంజియోగ్రామ్‌లు,యాంజియోప్లాస్టీలు వంటి కీలకమైన ప్రక్రియలను నిర్వహించడానికి వీలు కల్పిస్తూ హృద్రోగులకు సకాలంలో చికిత్సను అందించుటకు ఉపయుక్తంగా ఉంటుంది. అడ్వాన్స్‌డ్ కార్డియాక్ యూనిట్‌లో ఆధునిక కార్డియాక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐ.సి.యూ), కార్డియోథొరాసిక్ ఆపరేషన్ థియేటర్(ఓ.టి) ఒకే చోట ఉండడం వలన పూర్తిస్థాయి కార్డియాక్ సంరక్షణను అందజేస్తాయి.ఈ అడ్వాన్స్‌డ్ కార్డియాక్ యూనిట్ ప్రారంభంతో లాలా గూడలోని సెంట్రల్ హాస్పిటల్ భారతీయ రైల్వేలలో క్యాత్ ల్యాబ్ కలిగి ఉన్న నాల్గవ ఆసుపత్రిగా నిలిచింది. రైల్వే లబ్ధిదారులకు ముఖ్యంగా గుండె సంబంధిత వ్యాధులలో అత్యవసర చికిత్సను అందించేందుకు ఎంతోగానో ప్రయోజనకారిగా ఉంటుంది. ఈ సందర్భంగా శ్రీ అరుణ్ కుమార్ జైన్ మాట్లాడుతూ, రైల్వే ఉద్యోగులు మరియు వారి కుటుంబాలకు ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే దిశగా ఈ కొత్త సౌకర్యం ఒక ప్రధాన అడుగు అని అన్నారు. సకాలంలో గుండె సంబంధిత సంరక్షణ ప్రాణాలను కాపాడుతుందని మరియు ఈ చొరవ దక్షిణ మధ్య రైల్వేకు తన సిబ్బంది శ్రేయస్సు పట్ల ఉన్న నిబద్ధతను ప్రతిబింబిస్తుందని ఆయన నొక్కి చెప్పారు.

## లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వకపోవడం సరైనదికాదు : భూక్య సంజీవ్ నాయక్



ప్రసంగిస్తున్న సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షులు భూక్య సంజీవ్ నాయక్

**చిక్కడపల్లి, జూన్ 26 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వకపోవడం సరైనదికాదని సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షులు భూక్య సంజీవ్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. లంబాడీలకు అన్యాయం చేస్తే సహించబోమని హెచ్చరించారు. గురువారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సేవాలాల్ సేన రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మహాసభ జరిగింది. అంతకుముందు సీఎం రేవంత్ రెడ్డిపై విధానాలపై కథం తొక్కుతు ఆర్టీసీ కళ్యాణ మండపం నుంచి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో సంజీవ్ నాయక్ మాట్లాడుతూ... కులగణన చేపట్టినప్పుడు తాము కూడా మద్దతు పలికామని, ఉమ్మడి రాష్ట్రంలో ఎన్ని ఉద్యమాలు చేసిన తండాలు గ్రామ పంచాయితీలు కాలేదని, కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక మా తండాలకు మా రాజ్యాం కావాలంటే స్పందించి తండాలను గ్రామపంచాయితీలు చేశారని అది కేసీఆర్ వలనే సాధ్యమయ్యిందన్నారు. కేసీఆర్ మమ్మల్ని పిలిచి తెలంగాణ భవన్‌లో గొప్ప సమావేశం ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి సిఎం కావడం వెనుక తమ బంజారాల బిడ్డల కృషి ఉందన్న విషయం మరిచిపోవాద్దన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి లంబాడీలు కూడా కారణమేనని అన్నారు. రాహుల్ గాంధీ రాజ్యాంగం పట్టుకుంటే, రాజ్యాంగం అమలు అవుతుందని మేం అనుకున్నాం కానీ మాకు మంత్రి పదవి దక్కలేదన్నారు. తాము ఓట్లు వేస్తేనే కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిందని, ఈ ప్రభుత్వంలో మా భాగస్వామ్యం ఇవ్వరా అని ప్రశ్నించారు. నలుగురు లంబాడీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలున్నా మంత్రి పదవి దక్కలేదని, మంత్రిపదవి కోసం తామంతా ఎదురుచూస్తున్నామన్నారు. తమ సేనలో ఉన్నవారికి పదవి అడగటం లేదని, ఎస్టీ ఎమ్మెల్యేలుగా ఉన్న లంబాడీలకు ఇస్తారా లేదా నిలదీశారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మంత్రి పదవి తీసుకున్నారని, కానీ మాకు ఇవ్వడానికి అడగటం లేదని అన్నారు. సమావేశం అనంతరం సేవాలాల్ సేన రాష్ట్ర నూతన కమిటీని ఎనుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బానోతు కిషన్ నాయక్, సైదా నాయక్, లకావత్ భాస్కర్, గ్రేటర్ అధ్యక్షులు వి. కళ్యాణ్ నాయక్, నేనావత్ అజయ్, బానోతు హుస్సేన్ నాయక్, బాలు నాయక్, లకావత్ స్వరాజ్, రమేష్ మహరాజ్, భూక్య బాబులాల్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ వద్దు..జీవితం ముద్దు




లాలాపేట్‌లో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన ర్యాలిలో పాల్గొన్న జిల్లా ఎక్సైజ్ ఆఫీసర్ నవీన్‌కుమార్ బిజేపీ, కాంగ్రెస్, టీఆర్ఎస్ నేతలు

**తార్నాక, జూన్ 26 ప్రభాతవార్త :** డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రతి ఒక్కరు నడుం బిగించాలని మల్కాజ్గిరి డిస్ట్రిక్ట్ ఎక్సైజ్ ఆఫీసర్ నవీన్ కుమార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ లాలాపేట్ స్టేడియం నుండి శాంతి నగర్ క్రాస్ చౌరస్తావరకు డ్రగ్స్ వ్యతిరేక అవగాహన ర్యాలీని ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులు, రాజకీయ నాయకులతో కలిసి భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు డ్రగ్స్ కు వ్యతిరేకంగా ప్ల కార్డ్స్ పట్టుకుని స్లొగన్స్ ఇచ్చారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ డిస్ట్రిక్ట్ ఎక్సైజ్ ఆఫీసర్ పంచాక్షరి, అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ శ్రీనివాస్, ముషీరాబాద్ ఎక్సైజ్ రామకృష్ణ, మల్కాజిగిరి ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశంలో యువత మాదకద్రవ్యాల బారినపడి తమ విలువైన బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అందువల్ల ఒక మెరుగైన సమాజాన్ని కోల్పోతున్నామన్నారు. తల్లి తండ్రులు తమ పిల్లల్ని పట్టించుకోకపోవడం వల్లనే ఎక్కువగా డ్రగ్స్ కు అలవాటు పడే ప్రమాదం జరుగుతుందనీ ఆవేదన చెందారు, ఈ మహమ్మారినీ దేశం నుంచి వెళ్లగొట్టాలంటే దీనిలో ప్రతి ఒక్కరు భాగస్వాములై తమ సామాజిక బాధ్యతను నిర్వర్తించినప్పుడే ఈ డ్రగ్స్ రహిత ఒక మెరుగైన సమాజాన్ని చూడగలుగుతామని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు ప్రసన్న రెడ్డి, శ్రవణ్, నాగలక్ష్మి, శివకృష్ణ, తో పాటు కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కిషోర్ యాదవ్, బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబర్ సుక్క గణేష్ ముదిరాజ్, టీఆర్ఎస్ నాయకులు సునీల్ ముదిరాజ్, ఉపేందర్ యాదవ్, ఎర్ర నాగు, రాము వర్మ, మధుబాబు, మల్లికార్జున్, రాహుల్, ఇ.ఎస్ రవి, గోపాల్, కిరణ్ గౌడ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## చెత్త వేయడం నిరోధించేందుకు సిసి కెమెరాలు ఏర్పాటు



హైదర్షాకోట్ ఎర్రకుంట కట్టపై చెత్త వేయడంను నిరోధించేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసిన మాజీ డిప్యూటీ మేయర్ పి.రాజేందర్‌రెడ్డి.

**నార్సింగి, జూన్ 26 ప్రభాతవార్త :** చెత్త వేయడంను నిరోధించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కాంగ్రెస్ నాయకుడు, 16.వ,డివిజన్ ఇంచార్జి టింకురెడ్డితో కలిసి రాజేందర్‌రెడ్డి కార్పోరేషన్ పరిధిలోని హైదర్షాకోట్ ఎర్రకుంట కట్టపై చెత్త వేయడంను అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుంట కట్టపై చెత్త వేయవద్దని, వందల సార్లు చెప్పినా ప్రజలలో మార్పు రావడం లేదని, చీకట్లో చెత్తను తెచ్చి కట్టపై వేసి వెళ్తున్నారన్నారు. ఈ కట్టపై అహ్లాదకరమైన వాతావరణంను ఏర్పాటు చేశామని, వాకింగ్ ట్రాక్, విశ్రాంతి గది నిర్మించామన్నారు. చెత్తను వేయడంతో ఇక్కడ దుర్వాసన వస్తుందన్నారు. ఇళ్ల ముందుకు వచ్చే ఆటోల్లోనే చెత్త వేయాలని, రోడ్ల పక్కల వేయ వద్దని అధికారులు ఎన్నిమార్లు అవగాహన కల్పించినా ప్రజలలో మార్పు రావడం లేదన్నారు. ఎవరు ఇక్కడ చెత్తను వేస్తున్నారో వారిని గుర్తించి, చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి, చెత్త వేయడంను నిరోధించడానికి అనువుగా ఉంటాయన్న ఉద్దేశంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించామని వివరించారు. ఇకపై ప్రజలు జాగరూకులై ఉండాలని, కుంట కట్టపై చెత్త వేసి తప్పించుకోవడం సాధ్యపడదన్నారు. ఈ కార్యక్రమంలో శాంతినగర్ కాలనీ అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, సభ్యులు సురేష్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## 100 దొంగతనాలు 25సార్లు జైలు

**- ఘరానా దొంగను అరెస్ట్ చేసిన బండ్లగూడ పోలీసులు**

**హైదరాబాద్,జూన్26, ప్రభాతవార్త:** దొంగతనాల్లో ఆరితేరిన నిందితుడు. ఏకంగా వంద దొంగతనాలు, 25సార్లు జైలుకెళ్లిన అతని బుద్ధి మారలేదు. బయటకు వచ్చిన మళ్లీ ప్రవృత్తిని కొనసాగిస్తుండడంతో బండ్లగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం చాంద్రాయణగుట్ట ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ సుధాకర్ వివరాలను వెల్లడించారు. నగరంలోని ఫతేదర్వాజాకు చెందిన మహ్మద్‌సలీం (54) అలియాస్ సునీల్‌శెట్టి. గత 33ఏళ్లుగా దొంగతనమే వృత్తిగా ఎంచుకున్నాడు. పోలీసులకు పట్టుబడిన ప్రతిసారీ జైలుకెళ్లి తిరిగొచ్చాక మళ్లీ దొంగతనాలకు పాల్పడుతున్నాడు. రాచకొండ, సైబారాబాద్, హైదరాబాద్ కమిషనరేట్ల పరిధిలో అతనిపై వందకు పైగా దొంగతనం కేసులు నమోదయ్యాయి. పోలీసుల తనిఖీల్లో అతని వద్ద నుంచి 38గ్రాముల బంగారు అభరణాలను స్వాధీనం చేసుకున్నారు. 18 ఏళ్ల వయస్సులోనే మహ్మద్ సలీం ఇత్తడిపాత్రలు దొంగతనాలకు పాల్పడడంతో అరెస్ట్ అయ్యాడు. ఇతని నేరాలను చూసి తల్లిదండ్రులు ఇల్లు వదిలి చాదర్‌ఘాట్‌లో నివాసముంటున్నారు. అయితే క్రమక్రమంగా బంగారు అభరణాల కోసం ఓల్డ్‌సిటినే టార్గెట్ చేసి రాత్రి వేళల్లో దొంగతనాలకు పాల్పడుతున్నాడు. మెయిన్‌గేట్ నుంచి కాకుండా భవనంపై నుంచి రంధ్రం చేసి గుట్టుచప్పుడు కాకుండా ఇంట్లోకి ప్రవేశించి తను తెచ్చుకున్న మొబైల్ ఫోన్ టార్చి, కటింగ్ ప్లేయర్‌తో బీరువాలను తదితర వాటిని పగులగొట్టి దోచుకుని పరారవుతుంటారని పోలీసులు తెలిపారు.



29వ తేదీన కెపిహెచ్బి కాలనీ ఏడవ పేస్‌లోని శ్రీశ్రీశ్రీ కైతలపూర్ ఎల్లమ్మ తల్లి బోనాలకు రావాల్సిందిగా ఈటెల రాజేందర్‌ని కమిటీ వ్యవస్థాపకులు కొలుముల సంతోష్ కుమార్‌తో కలిసి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆహ్వానిస్తున్న దృశ్యం

## క్రీడా కోటా జీవోను సవరించాలి

**-మంత్రి శ్రీహరికి వ్యాయామవిద్య ఉపాధ్యాయ సంఘం వినతి**



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న కృష్ణమూర్తిగౌడ్, చంద్రయ్య, శ్రీనివాస్ తదితరులు

**హైదరాబాద్,జూన్, 26,ప్రభాతవార్త:** ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడాకారులకు న్యాయం జరిగేలా స్పోర్ట్స్ రిజర్వేషన్ జీఓ 74ను సవరించాలని, ఫారమ్ 14 తొలగించి అదే స్థానంలో 190 ప్రాధాన్య క్రమాన్ని అమలు చేయాలని రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరిని వ్యాయాయ విద్య ఉపాధ్యాయుల సంఘం (పెటా టిఎస్) కోరింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నగాని కృష్ణమూర్తి గౌడ్ సహా నల్లగొండ, హైదరాబాద్ జిల్లాల అధ్యక్షులు చంద్రయ్య, కట్ట శ్రీనివాస్‌లు గురువారం సచివాలయంలోని కార్యాలయంలో స్పోర్ట్స్ మినిస్టర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. స్పోర్ట్స్ రిజర్వేషన్ జీవో 74 ప్రకారం క్రీడాకారులు ప్రభుత్వ ఉద్యోగాలు పొందలేకపోతున్నారు. జీవో 74ను సవరించి 190 ప్రాధాన్యతల ప్రకారం ఉద్యోగాలను కల్పించాలి. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 1700 స్కూల్ అసిస్టెంట్ ఎడ్యుకేషన్ పోస్టులు, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 2447 పీఈటీ పోస్టులు మంజూరు చేయాలి. స్పోర్ట్స్ రిజర్వేషన్‌ను 2 శాతం నుంచి 5 శాతానికి పెంచాలని మంత్రికి పెటా టిఎస్ నాయకులు విన్నవించారు. దేశానికి ఆదర్శంగా నిలిచేలా నూతన క్రీడా విధానం రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం పట్ల మంత్రి వాకిటి శ్రీహరికి పెటా టిఎస్ తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యనరకమంలో వ్యాయామ విద్య ఉపాధ్యాయులు ప్రకాశ్, రాజేందర్, విక్రమ్, శక్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రమాద నాటక' దొంగలు దొరికారు

**- నిందితుల నుంచి రూ.17లక్షలు స్వాధీనం**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ శిల్పవల్లి

**హైదరాబాద్, జూన్26, ప్రభాతవార్త:** చిట్‌ఫండ్స్ డబ్బులను ప్రమాదం నాటకమాడి ఎతునతకెళ్లిన ఇద్దరు నిందితులు దోమలగూడ పోలీసులకు పట్టుబడ్డారు. అయితే పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా ఆచూకీ గుర్తించి అరెస్ట్ చేసి రూ.17 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. గురువారం డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ శిల్పవల్లి వివరాలను వెల్లడించారు.మలక్‌పేటలోని మూసారాం బాగ్‌లో నివసముంటున్న జెథిన్‌రాజు యాదవ్ (21) మన్నావన చిట్‌ఫండ్స్‌లో ఆరు నెలలుగా కలెక్షన్ బాయ్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. మరో నిందితుడు సౌతఅభిలాష్ ఆఫీస్‌బాయ్‌గా చేస్తున్నారు. ఈ క్రమంలో జూబ్లీహిల్స్‌లోని ఓ ఖాతదారుడిని వద్ద నుంచి రూ.17లక్షలు వసూలు చేసుకుని రావాలని అబిడ్స్ శాఖలో ఉన్న కలెక్షన్‌బాయ్‌కు చెప్పడంతో వెళ్లి నగదును తీసుకున్నాడు. మార్గమధ్యలో హిమాయత్‌నగర్‌కు రాగా డబ్బులు కొట్టేసేందుకు పథకాన్ని రూపొందించి ప్రమాదం జరిగిందని, డబ్బుల బ్యాగు ఎవరో వచ్చి తీసుకున్నారని బుకాయించాడు. దీంతో చిట్స్‌ఫండ్స్ నిర్వహకుడు గోపాల్‌తపారీయా పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించి తమదైన శైలీలో విచారించగా డబ్బులు తనే తీసుకున్నట్లు అంగీకరించగా..నిందితులిద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఇంట్లో దాచిపెట్టిన రూ.14.50లక్షలతో పాటు ఆసుపత్రి బిల్లు అని నాటకమాడిన మరో రూ.2.50లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించారు.



గోల్కొండ బోనాలకు హాజరైన రంగారెడ్డి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్ ,రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ పొన్నమోని మల్లేష్ యాదవ్‌లను సన్మానిస్తున్న కుమ్మరి సంఘం సభ్యులు

## ప్రజల సంక్షేమం కోసం గవర్నర్ బండారు దత్తాత్రేయ నిరంతరం కృషి : దేవర రాజేశ్వర్


గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా ప్రజల కదే నా ఆత్మకథఖి పుస్తకాన్ని అందుకుంటున్న ప్రముఖ వ్యాపారస్తులు దేవర రాజేశ్వర్ తదితరులు

**మలక్ పేట ,జూన్ 26, ప్రభాతవార్త:** ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ఘనత హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ కే దక్కుతుందని మహారాజ్ గంజ్ శ్రీ సావిత్రి కన్య ఉన్నత పాఠశాల సలహాదారులు, మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ ప్రముఖ వ్యాపారవేత్త దేవర రాజేశ్వర్ పేర్కొన్నారు. గవర్నర్ బండారు దత్తాత్రేయ యొక్క ఆత్మ కథ ఖిప్రజల కదే నా ఆత్మకథఖి పుస్తకాన్ని గవర్నర్ బండారు దత్తాత్రేయ స్వహస్తాలతో వారికీ అందజేశారు. ఈ సందర్బంగా దేవర రాజేశ్వర్ మాట్లాడుతూ గవర్నర్ బండారు దత్తాత్రేయ యొక్క ఆత్మకథ పుస్తకం ప్రజల కదే నా ఆత్మకథఖి పుస్తకాన్ని వారి స్వహస్తాలతో తీసు కోవడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. గవర్నర్ బండారు దత్తాత్రేయ జీవితం అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నా రు. వారి జీవితం ప్రజాసేవకే అంకితం అని తెలిపారు. గవర్నర్ బండారు దత్తాత్రేయ నిరంతరం ప్రజల సేవలో ఉంటూ, దేశానికి సేవ చేస్తూ, అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్నారని పేర్కొన్నారు.

### నూరు శాతం పనులను పూర్తి చేయడం సంతోషంగా ఉంది


సీసీ రోడ్డు పనుల ప్రారంభోత్సవంలో కార్పొరేటర్

**హయత్ నగర్, జూన్ 26 ప్రభాతవార్త :** ఆదిత్య నగర్ కాలనీలో అభివృద్ధి పనులను నూరు శాతం పూర్తి చేయడం సంతోషంగా ఉందని మన్సురాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్ నగర్ ప్రాంతం ఆదిత్య నగర్ కాలనీలో 22 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేయనున్న సీసీ రోడ్డు పనులను ఆయన కాలనీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ సంవత్సర కాలంగా పెండింగ్ పనులను ఒక్కొక్కటిగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. రోడ్డు నిర్మాణంలో సరైన లెవెల్స్ పాటించాలని, నాణ్యత ప్రమాణాలు విస్మరిస్తే ఊరుకునేది లేదని గుత్తేదారులును హెచ్చరించారు. తెలిపారు. సాధ్యమయినంత తొందరగా సీసీ రోడ్డును ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు పి.కృష్ణ, పి. రాజేంద్ర ప్రసాద్, మురళీధర్ రెడ్డి, బిక్షపతి, రామ కృష్ణ, చంద్ర శేఖర్, వెంకటేష్, బలరామ్, డి.శంకర్ పాల్గొన్నారు.

### నేరాల నివారణకు సిసి కెమెరాలు ఎంతో ప్రాముఖ్యం



**నేరేడ్‌మెట్, జూన్ 26.ప్రభాతవార్త :** నేరాల అదుపునకు సీసీ కెమెరాలు ఎంత ఉపయోగపడతాయో వాటిపై అవగాహన సదస్సు కార్యక్రమాన్ని వినాయక్ నగర్ వాసులతో నేరేడ్మెట్ ఇన్స్పెక్టర్ సందీప్ కుమార్ సమావేశాన్ని నిర్వహించారు. శుక్రవారం నేరేడ్మెట్ ఇన్స్పెక్టర్ సందీప్ కుమార్ ,సెక్టార్ ఎస్ ఐ శ్రీనివాస్ రావు తో కలిసి, వినాయక్ నగర్ ప్రాంతంలో శాంతి భద్రతలను కాపాడి,ప్రశాంత వాతావరణం కల్పించడంలో వినాయక్ నగర్ ప్రాంత వాసులకు ఉపయోగపడే సి సి కెమెరాల ఆవశ్యకత గురించి అందుబాటులో ఉన్న వివిధ రాజకీయ,సామాజిక రంగాలకు చెందిన వినాయక్ నగర్ నివాసులతో నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ ఆవరణలో సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని సిఐ సందీప్ కుమార్ తెలిపారు.సి సి కెమెరాల ఏర్పాటు చేసుకోవడానికి ప్రణాళిక ప్రకారం ఏ విధంగా ముందుకు పోవాలో దిశా నిర్దేశం చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వినాయక్ నగర్ చెందిన ప్రజాప్రతినిధులు, ప్రముఖ సంఘ సేవకులు తదితరులు పాల్గొన్నారు.

### అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి : శ్రీనివాస్


మల్లు రవికి పుష్ప గుచ్చాలను అందజేసి శాలువాతో సన్మానిస్తున్న టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్ తదితరులు

**మలక్ పేట, జూన్ 26, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తుందని టీపీసిసి మాజీ ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మలక్ పేట్ నుంచి నాయకులు, కార్యకర్తలతో కలిసి చేకోలేకార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గాంధీభవన్ కు తరలి వెళ్లి కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ మల్లు రవిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాలను అందజేసి సన్మానించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి వారిని చైతన్య పరచాలని క్రమ శిక్షణ సంఘం చైర్మన్ మల్లు రవి పేర్కొనడం జరిగిందని తెలియజేశారు. గ్రేటర్ లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని ఆయనకు వివరించడం జరిగిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కిషన్ సింగ్, మహమ్మద్ షకీల్, అధ్యక్షులు లింగాల శ్రీనివాస్ గౌడ్, చక్రపాణి,నాయకులు మహేష్ కుమార్ పాల్గొన్నారు.

### బడంగ్‌పేట్ ఎఎంసిగా బాధ్యతలు చేపట్టి జాన్ కృపాకర్



**సరూర్‌నగర్, జూన్ 26 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన అసిస్టెంట్ కమీషనర్‌గా (ఎఎంసి) గా జాన్ కృపాకర్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న శ్యామ్ సుందర్ నిజాం పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ కాగా వికారాబాద్ మున్సిపాలిటీలో రెవెన్యూ ఆఫీసర్‌గా పని చేస్తున్న జాన్ కృపాకర్‌కు ప్రమోషన్ లభించి బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు అసిస్టెంట్ కమీషనర్‌గా వచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ బడంగ్‌పేట్ కార్పొరేషన్ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి పని చేస్తానని వెల్లడించారు.

## వినియోగదారుల నమ్మకంతోనే మనుగడ సాధ్యం



**మల్కాజిగిరి జూన్26,ప్రభాతవార్త :** వినియోగదారుల నమ్మకంతోనే బ్యాంకుల మనుగడ సాధ్యమమవుతుందని సిటిజెన్ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ రాజు అన్నారు. 27 సంవత్సరాలుగా తమ సొసైటీ మీద నమ్మకంతో ఖాతాదారులు డిపాజిట్లు చేస్తూ అధిక శాతం వడ్డీ పొందుతున్నారని చెప్పారు. గురువారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా హనుమాన్ పేటలో సిటిజెన్ కో ఆపరేటివ్ సొసైటీ బ్యాంకు ఖాతాదారుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సిటిజెన్ కోఆపరేటివ్ సొసైటీ సహకార సంఘం 1997లో స్థాపించబడిందని, మార్చి 2024 నాటికి రూ. 4,000 కోట్ల వ్యాపారాన్ని అధిగమించి రూ. 77.58 కోట్ల లాభాన్ని ఆర్జించినట్లు చైర్మన్ రాజు తెలిపారు. ప్రధానంగా బంగారు రుణాలు, గృహ రుణాల వంటి ఆర్థిక సేవలను ఐదు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో బహుళరాష్ట్ర కోఆపరేటివ్ సొసైటీగా పనిచేస్తోందని సిటిజెన్ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ రాజు వెల్లడించారు. వ్యక్తిగత, వీక్లీ , చిన్న రుణాలతో పాటు బీమా పథకాలను కూడా తమ సొసైటీ అందిస్తుందని వివరించారు. ఈ ఏడాది రూ. 5 వేల కోట్ల వ్యాపారం లక్ష్యంగా పెట్టుకున్నామని సిటిజెన్ కో ఆపరేటివ్ సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ మన్నె నరేంద్ర కుమార్ తెలిపారు. 11 శాతం పురోభివృద్ధి సాధించినట్లు వివరించారు. సొసైటీ కొత్తగా 10 నూతన బ్రాంచ్ లను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలను రూపొందించిందని, అందులో 5 తెలంగాణాలో, మరో 5 ఆంధ్రప్రదేశ్ లో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో సిటిజెన్ కో ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ సోమలింగం గౌడ్, మేనేజర్ ఎస్ ఎం పీరాన్, ఖాతాదారులు ఏ.వీ స్వామి,మహమ్మద్ నూర్, శంకర రావు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో మాయమాటలు చెప్పే నాయకులను నమ్మవద్దు : మధుయాష్కీ


సి.సి.రోడ్డు నిర్మాణపు పనులకు మధుయాష్కీ, రాంరెడ్డి తో కలిసి శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ రాగుల.

**వనస్థలిపురం. జూన్. 26.ప్రభాతవార :** ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి,పబ్బం గడుపుకునే నాయకులను నమ్మవద్దని టి.పి.సి.సి.ప్రచారకమిటి చైర్మన్,మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ పేర్కొన్నారు. వనస్థలిపురం డివిజన్ లోని వనస్థలిహిల్స్ కాలనీలో కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర రెడ్డి చేసిన సి.సి.రోడ్ల శంకుస్థాపన కార్యక్రమంలో రోడ్లు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మలరెడ్డి రాంరెడ్డి తొ కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ వనస్థలిపురం డివిజన్ అభివృద్ధి కి ముఖ్యమంత్రి రూ.18 కోట్లు మంజూరు చేశారని, పనిచేసే ప్రభుత్వం కాంగ్రెస్ అన్నారు. పనిచేసే నాయకుని కి పట్టం కట్టాలని, మాయమాటలు చెప్పే నాయకులకు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు.వనస్థలిహిల్స్ కాలనీకి కమ్యూనిటీ భవనం అదనపు అంతస్తు నిర్మాణానికి, మహిళా భవనం,ఓపెన్ జిమ్ తదితర అభివృద్ధి పనులకు నిధులు ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. రోడ్లు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ పనామా చౌరస్తా వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కి వినతిపత్రం ఇచ్చామన్నారు. ప్రతిఒక్కరు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు కార్తిక్,రాజగోపాల్,విగ్నేశ్వరి, సాయి శ్రీనివాస్, కాలనీ అధ్యక్షుడు మల్ రెడ్డి యాదిరెడ్డి,ప్రధాన కార్యదర్శి కంచి కృష్ణమోహన్,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నెలపాటి రామారావు పాశం అశోక్ గౌడ్,వివిధ కాలనీల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్, హెచ్ఎండిఏ రోడ్డు పనులకు రూ.24 కోట్లు మంజూరు


మేడ్చల్ ఇంచార్జ్ వజ్రేష్ యాదవ్, తోటకూర అజయ్ యాదవ్ , కొత్త కిషోర్ గౌడ్‌ని సన్మానిస్తున్న మాజీ కార్పొరేటర్లు బొమ్మక్ కళ్యాణ్ ,కిరణ్ కుమార్ నాయకులు హరినాథ్ రెడ్డి

**బోడుప్పల్ , జూన్ 26 ప్రభాతవార్త ;** బోడుప్పల్ అంబేద్కర్ విగ్రహం నుండి చిలుక నగర్ వరకు 12 కోట్లు , బంగారు మైసమ్మ దేవాలయం నుండి చెంగిచర్ల ఓల్డ్ విలేజ్ వరకు హెచ్.ఎం డి.ఎ నుండి రాచెరువు అభివృద్ధి పనుల కొరకు 5 కోట్లు , హెచ్.ఎం డి.ఎ పార్క్ అభివృద్ధి కొరకు వీరా రెడ్డి నగర్ కాలని లక్ష్మి నగర్ కాలనీ చెంగిచర్ల ఓల్డ్ విలేజ్ 2.5 కోట్లు సి డి ఎం ఎ నుండి 3.45 కోట్లు కట్ట మైసమ్మ నుండి సుద్దకుంట వరకు పనులకు ప్రభుత్వం నుండి నిధులు మంజూరు అయిన సందర్బంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు,మాజీ కార్పొరేటర్లు, కాంటెస్ట్ కార్పొరేటర్లు. కాలనీ అధ్యక్షులు ప్రభుత్వం నుండి ఈయొక్క నిధుల సమీకరణ లో ముఖ్య పాత్ర వహించిన మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ ,మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ కి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మేడ్చల్ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు బొమ్మక్ కళ్యాణ్ కుమార్ , కుంభం కిరణ్ కుమార్ రెడ్డి ,చీరాల నరసింహ , సినియర్ కాంగ్రెస్ నాయకులు పులకండ్ల జంగారెడ్డి ,కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఫకీర్ హరినాద్ రెడ్డి , డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, మహిళ నాయకురాలు . యూత్ నాయకులు రామగళ్ళ చంటి తదితరులు పాల్గొన్నారు.

## నాగోల్‌లో ఆల్ ఇండియా యాదవ్ మహాసభ రాష్ట్ర కమిటీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న చింతల రవికుమార్‌యాదవ్

**ఎల్.బి.నగర్, జూన్ 26 ప్రభాతవార్త:** యాదవ కులస్తులంతా ఐకమత్యంతో ఉంటూ హక్కులను సాధించుకోవాలని ఆల్ ఇండియా యాదవ్ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు చింతల రవికుమార్‌యాదవ్ పేర్కొన్నారు. నాగోల్ శుభం కన్వెన్షన్ సెంటర్లో గురువారం ఆలిండియా యాదవ మహాసభ రాష్ట్ర కార్యవర్గ సమావేశం మేకల రాజేందర్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రవి కుమార్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో యాదవులకు సరైన ప్రాతినిధ్యం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం ప్రకారం అధిక శాతం జనాభా కలిగిన యాదవులకు ప్రాధాన్యత ఇస్తూ ఎమ్మెల్సీ, కార్పొరేషన్ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో అన్ని రాజకీయ పార్టీలు యాదవులకు ప్రాధాన్యత ఇస్తూ టికెట్లను కేటాయించాలన్నారు. విద్యా, వైద్యం, రాజకీయం, ఆర్థికంగా యాదవులు ఎదగాలంటే గ్రామస్థాయి నుంచి ఐకమత్యంగా పనిచేయాలన్నారు. కోకాపేటలో రూ.5 కోట్ల వ్యయంతో నిర్మించిన యాదవ సంఘం భవనాన్ని త్వరగా ప్రారంభించాలని, అందుకోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని త్వరలో కలిసి యాదవ కులానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని కూడా అందజేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం దేశవ్యాప్తంగా జనగణనలో కులగలను నిర్వహించాలన్నారు. కొమురవెల్లి, ఐలవోను శ్రీమల్లన్నస్వామి దేవాలయం చైర్మన్ పదవులను యాదవులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా యాదవ సామూహిక వివాహాలు, యాదగిరిగుట్ట యాదవ్ భవన నిర్మాణం, గదుల దాతల కొరకు జిల్లా అధ్యక్షుల భాగస్వామ్యం, రాష్ట్ర, జిల్లా స్థాయి నిర్వాహణ కమిటి తదితర అంశాలపై చర్చ నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన రవికుమార్ను వివిధ జిల్లాల నాయకులు గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో జాతీయ ప్రధానకార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్, ఉపాధ్యక్షుడు బాలమల్లేష్, కోశాధికారి వీరవెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రతినిధులు బి.శ్రీనివాస్, వెంకటనరసయ్య, శేఖర్, కన్నె రమేష్, శ్రీదేవి, గోవర్ధన్, ఈశ్వరమ్మ, డాక్టర్ మధుసూదన్‌యాదవ్, డాక్టర్ రవికుమార్‌యాదవ్, చింతల సురేందర్‌యాదవ్, వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యవర్గం పాల్గొన్నారు.

## భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఎమర్జెన్సీ ఓ చీకటి అధ్యాయం : బిజెపి


సమావేశంలో మాట్లాడుతున్న భాగ్యనగర్ జిల్లా బిజెపి అధ్యక్షుడు నిరంజన్ యాదవ్

**సైదాబాద్, జూన్ 26 ప్రభాతవార్త:** భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఎమర్జెన్సీ ఓ చీకటి అధ్యాయమని ఎమ్మెల్సీ ఏవిఎన్ రెడ్డి, బిజెపి జాతీయ నాయకులు పేరాల శేఖర్‌జీ, భాగ్యనగర్ జిల్లా బిజెపి అధ్యక్షుడు నిరంజన్ యాదవ్‌లు అన్నారు. ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాలు గడిచిన సందర్భంగా భాగ్యనగర్ జిల్లా బిజెపి ఆధ్వర్యంలో సైదాబాద్‌లో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్సీ ఏవిఎన్ రెడ్డి, పేరాల శేఖర్‌జీ, నిరంజన్ యాదవ్‌లు మాట్లాడుతూ 1975 జూన్ 25 నుండి 21 నెలల పాటు ఎమర్జెన్సీ పేరుతో ఆ నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి దేశ ప్రజల గొంతును నొక్కి వేసిందన్నారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన ప్రతిపక్ష నాయకులను, ఆర్ఎస్ఎస్, ఏబివిపి, జనసంఘ్ నాయకులను జైళ్లలో పెట్టారని, పత్రికలపై సెన్సార్ విధించారని, పౌరుల ప్రాథమిక హక్కులు, మానవ స్వేచ్ఛను హరించి వేశారని అన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, జంగం శ్వేత మధుకర్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, నాయకులు భరత్ ప్రసాద్, రాజవర్ధన్‌రెడ్డి, విద్యాన్‌రెడ్డి, కూసూరు సహదేవ్ యాదవ్‌తో పాటు బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బాలాపూర్ గ్రామంలో అద్దె కోసం వచ్చిన అగంతకుల ఘాతుకం

**మహిళ మెడలో నుండి ఐదు తులాల బంగారు గొలుసు అపహరణ**

**నిందితుల కోసం పోలీసుల గాలింపు.. ముమ్మరంగా తనిఖీలు**


సొమ్మసిల్లిన నీరుడు నర్సమ్మకు సపర్యలు చేస్తున్న బాలాపూర్ పాత గ్రామం స్థానికులు

**సరూర్‌నగర్, జూన్ 26 ప్రభాతవార్త:** అద్దె కోసం వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు పట్ట పగలు ఒంటరిగా ఉన్న ఓ మహిళ మెడలో నుండి ఐదు తులాల బంగారు మంగళ సూత్రాల గొలుసును తెంపుకొని పరారయ్యారు. ఈ హఠాత్‌పరిణామానికి భయపడిన సదరు మహిళలు స్పృహ కోల్పోగా స్థానికులు గమనించి సపర్యలు చేయడంతో ఆమె కోలుకుంది. ఈ సంఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలాపూర్ గ్రామంలో గురువారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం బాలాపూర్ పాత గ్రామంలో నివసిస్తున్న నీరుడు యాదమ్మ ఇంటి వద్దకు గురువారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి ఇల్లు అద్దెకు కావాలని అడిగారు. అయితే ఆ సమయంలో వీధి నిర్మానుష్యంగా ఉండడంతో అదే అదనుగా భావించిన అగంతకులు యాదమ్మ ఒంటిపై ఉన్న ఐదు తులాల బంగారు గొలుసును తెంపుకొని రెప్పపాటులో మాయమయ్యారు. అనుకోని ఈ ఘటనతో బిత్తరపోయిన యాదమ్మ ఆందోళనతో కేకలు వేసి స్పృహ కోల్పోయింది. దీంతో స్థానికులు అక్కడికి చేరుకొని ఆమెకు సపర్యలు చేయడంతో ఆమె కోలుకుంది. ఈ మేరకు బాలాపూర్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో వారు కేసును నమోదు చేసుకొని నిందితుల కోసం గాలిస్తున్నారు. చెయిన్ స్నాచింగ్ ఘటనలతో స్పందించిన పోలీసులు బాలాపూర్ పరిసరాల్లో తనిఖీలను ముమ్మరం చేశారు.

### ఘనంగా ప్రారంభమైన వారాహి దేవి నవరాత్రులు

**ఎల్.బి.నగర్, జూన్ 26 ప్రభాతవార్త:** ఆర్కేపురంలోని కుర్తాళ పీఠం శ్రీప్రత్యంగిరాదేవి దేవాలయంలో వారాహీదేవి నవరాత్రులు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేవాలయం సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ మాట్లాడుతూ... పీఠాధిపతులు జగద్గురువులు శ్రీ సిద్దేశ్వరానందభారతి మహాస్వామి వారి ఆశీస్సులతో, ఉత్తరాధికారి శ్రీ దత్తేశ్వరానంద భారతి మహాస్వామి వారి ఆశీస్సులతో ఉత్సవాలు ప్రారంభించామన్నారు. నవరాత్రులలో భాగంగా ఉదయం అమ్మవారికి విశేష 18 రకాల ద్రవ్యాలతో అభిషేకం, అర్చనలు, మహిళలతో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించామన్నారు. ఉత్సవాలను పురస్కరించుకొని దేవాలయం ప్రాంగణం రంగురంగు పూలతో దేదీప్య మౌనంగా అలంకరించడం జరిగిందన్నారు. ఉత్సవాలను తిలకించడానికిజంట నగరాల నుండి వేల సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకి ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.కార్యక్రమంలో విఠల్‌శర్మ, నిఖిల్‌శర్మ, సువర్ణలత, అరుణ, జయశ్రీ, కనకవల్లి, రాధ, సరిత, మైధిలి పాల్గొన్నారు.

### మార్నింగ్‌వాక్‌లో సమస్యల పరిశీలన


కాలనీలో పర్యటిస్తున్న ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, జూన్ 26 ప్రభాతవార్త:** గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి గురువారం మార్నింగ్ వాక్‌లో భాగంగా పిఅండ్‌టీ కాలనీలో పర్యటించి, కాలనీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు భూగర్భ డ్రైనేజ్ తరచూ బ్లాక్ అవుతుందని కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు స్పందించిన కార్పొరేటర్ జలమండలి అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఉదయం 10 గంటలకు జలమండలి అధికారులతో కలిసి సంబంధిత ప్రాంతాన్ని పర్యటించి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కాలనీవాసులు ఓంకార్, హరికృష్ణ, కృష్ణ, సావిత్రి, శ్రీకాంత్, స్వామి, రంగారావు, బీజేపీ డివిజన్ అధ్యక్షులు దాసరి జయప్రకాష్, ఏనుగు శ్రీధర్‌రెడ్డి, గిరీష్, టీంకు తదితరులు పాల్గొన్నారు.

### అధికారుల అవినీతిపై విచారణ జరిపించాలి


జిహెచ్ఎంసి కమీషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, జూన్ 26 ప్రభాతవార్త:** సంతోష్‌నగర్ సర్కిల్ పరిధిలోని ఐఎస్ సదన్ డివిజన్‌లో డిఎస్ నగర్‌లోని నల్ల పోచమ్మ దేవాలయం నుంచి సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ వరకు వరదనీటి కాలువ నిర్మాణం చేపట్టకుండానే తప్పుడు బిల్లులతో రూ.53,59,330ల ప్రభుత్వ నిధులను తీసుకోవడానికి ప్రయత్నించిన ఉదంతంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులందరిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి గురువారం జిహెచ్ఎంసి కమీషనర్ ఆర్‌వి కర్ణన్‌కు ఫిర్యాదు చేశారు. తప్పుడు బిల్లులు, పత్రాలతో ఉద్దేశ్యపూర్వకంగా ప్రభుత్వ ధనాన్ని కాజేసే యత్నంలో భాగంగా ఇఆర్‌పి నెం.24023071తో రూ. 53,59,330లను తీసుకోవడానికి యత్నించిన అధికారులందరిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, 2021 నుండి ఇప్పటి వరకు ఐఎస్ సదన్ డివిజన్‌లోని అన్ని టెండర్‌లపై పూర్తి స్థాయిలో విజిలెన్స్ విచారణ జరిపించాలని కమీషనర్‌ను కార్పొరేటర్ శ్వేత కోరారు.

### సైదాబాద్ డివిజన్‌లో శానిటేషన్ డ్రైవ్

**సైదాబాద్, జూన్ 26 ప్రభాతవార్త:** వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని సైదాబాద్‌లో డివిజన్‌లో శానిటేషన్ డ్రైవ్‌ను గురువారం కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి ఏపిఏయు కాలనీలో డిసి జయంత్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అరుణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోడ్లపై చెత్తా చెదారాన్ని వేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌ఓ రుద్ర శ్రీనివాస్, ఎస్‌హెచ్‌ఓలు కళ్యాణ్, దేవేందర్ పాల్గొన్నారు.

**పార్కు అభివృద్ధిపై సమీక్ష..**

ఆంధ్రా బ్యాంకు కాలనీలోని పార్కులో చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి కార్పొరేటర్ కొత్తకాపు అరుణ సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. పార్కులో కొత్తగా లాన్, పూల చెట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ హార్టికల్చర్ ఆఫీసర్ సునందరెడ్డి, మేనేజర్ కిరణ్, సూపర్‌వైజర్ మహేష్, కాలనీ అధ్యక్షుడు కె.వి.కృష్ణారావు, కోశాధికారి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### అల్మాస్‌గూడ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

**అధ్యక్షునిగా ముడావత్ నర్సింహనాయక్ ఏకగ్రీవ ఎన్నిక**


నూతన అధ్యక్షుడు ముడావత్ నర్సింహ నాయక్‌ను సన్మానిస్తున్న బంజారాలు

**సరూర్‌నగర్, జూన్ 26 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. స్థానిక బంజారాలు ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో అందరి అమోదంతో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు అధ్యక్షునిగా ముడావత్ నర్సింహ నాయక్, ఉపాధ్యక్షులుగా దశరథ్ నాయక్, శంకర్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా రమావత్ అశోక్ నాయక్, కోశాధికారిగా ముడావత్ శంకర్ నాయక్, కార్యనిర్వాహక అధ్యక్షునిగా వెంకట్రాం నాయక్, రమేష్ చౌహాన్, గౌరవ అధ్యక్షులుగా లాలూ నాయక్, ధన్‌సింగ్ నాయక్, సలహాదారులుగా అమీన్ సింగ్ నాయక్, గణేష్ నాయక్, కార్యవర్గ సభ్యులుగా సూర్య నాయక్, రామచంద్ర నాయక్, సీతారాంనాయక్, తిరుపతినాయక్, పాండు నాయక్, శంకర్ నాయక్, రాంచందర్ నాయక్, వీరులాల్ నాయక్‌లు ఎన్నికయ్యారు. అదే విధంగా యువజన విభాగం అధ్యక్షునిగా నరసింహ నాయక్‌ను, పలువురిని సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాలను స్థానికులు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు నర్సింహ నాయక్ మాట్లాడుతూ బంజారాల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

### విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: ఏసిపి సుబ్బరామిరెడ్డి


మూసారంబాగ్‌లో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఏసిపి సుబ్బరామిరెడ్డి,ఇన్ స్పెక్టర్ నరేష్ తదితరులు

**మలక్ పేట ,జూన్ 26, ప్రభాతవార్త:** విద్యార్థులు మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని మలక్ పేట ఏసిపి సుబ్బరామిరెడ్డి, ఇన్ స్పెక్టర్ పిడమర్తి నరేష్ లు పేర్కొన్నారు. అంతర్జాతీయ మదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని మలక్ పేట పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మూసారంబాగ్ లో వివిధ కళాశాలల విద్యార్థులతో కలిసి మాదక ద్రవ్యాలకు, డ్రగ్స్ కు దూరంగా ఉండాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడకం వల్ల తలెత్తే దుష్పలితాల గురించి వివరించారు. మాదిగ ద్రవ్యాల వాడకం, విక్రయాల గురించి తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. డ్రగ్స్ వలన విద్యార్థుల బంగారు భవిష్యత్తు దెబ్బతింటుందని తెలిపారు. నగర పోలీస్ విభాగం ఆధ్వర్యంలో డ్రగ్స్ కు దూరంగా ఉండాలని కోరుతూ పలు విద్యా సంస్థలలో ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. అనంతరం విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరుతూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఇన్ స్పెక్టర్లు బ్రహ్మ మురారి, నాను నాయక్, ఎస్ఐలు సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: సీఐ


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ నాగరాజుగౌడ్

**హయత్ నగర్, జూన్ 26 ప్రభాతవార్త :** దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందని... యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హయత్ నగర్ ఇన్ స్పెక్టర్ నాగరాజుగౌడ్ అన్నారు. అంతర్జాతీయ మారకద్రవ్య దుర్వినియోగం, అక్రమరవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని హయత్ నగర్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.... విద్యార్థులకు ఇంటర్మీడియట్ దశ ఎంతో కీలకమైనదన్నారు. చదువు మీద దృష్టి సారించాలని చెడు వ్యసనాలకు బానిస కావద్దన్నారు. డ్రగ్స్ రవాణా, వినియోగం చట్టపరంగా నేరమని... అలాంటి విషయాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

### వందరోజుల కార్యచరణ ప్రణాళిక కార్యక్రమం



**తుర్కయంజాల్, జూన్ 26,ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి మునగనూరులో గురువారం కమిషనర్ అమరేందర్ రెడ్డి వివిధ అభివృద్ధి కార్యక్రమాలను మరియు డ్రైనేజీ రోడ్డు పనులను పలు పార్కు స్థలాలను పరిశీలించడం జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ,మున్సిపాలిటీ సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించడం జరిగింది. వంద రోజుల కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పరిధిలో పరిశుద్ధం మంచినీటి సరఫరా వీధి దీపాల నిర్వహణ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం ప్లాస్టిక్ నియంత్రణ, వనమహోత్సవ వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని కమిషనర్ అమరేందర్ రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డి ఈ బిక్షపతి, ఏఈ చంద్రశేఖర్ రెడ్డి, బండారి శ్రీనివాస్, మున్సిపాలిటీ సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### డిప్యూటీ మేయర్‌ను కలిసిన ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం


డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న హెచ్ఎం శ్రీవాణి

**తార్నాక, జూన్ 26 ప్రభాతవార్త :** లాలాపేట్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల నూతన హెడ్ మాస్టర్‌గా రానున్న శ్రీవాణి గురువారం డిప్యూటీ మేయర్ శ్రీమతి మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టిటియుసి రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డి లను మర్యాదపూర్వకంగా డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో కలిశారు.ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ నూతన హెడ్ మాస్టర్ శ్రీవాణికి శుభాకాంక్షలు తెలియజేశారు. గవర్నమెంట్ స్కూల్ అభివృద్ధి పనులలో మరింత పురోగతి సాధించేందుకు కృషి చేయాలని, విద్యారంగంలో వినూత్న మార్పులు తీసుకురావడంలో సమర్థత చూపాలని ఆకాంక్షించారు.

### సిమెంటు రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి


పనులను పరిశీలిస్తున్న కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

**నాచారం, జూన్ 26 ప్రభాతవార్త :** నాచారం డివిజన్‌లో రూ.25 లక్షల రూపాయల వ్యయంతో ఇందిరా నగర్ లోని మసీదు వీధి,చర్చి వీధిలలో కొత్తగా నిర్మిస్తున్న సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ గురువారం పర్యవేక్షించారు.చాలా కాలం వేచి ఉన్న తర్వాత ఈ రెండు వీధుల్లో భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తి చేసి రోడ్లు కూడా వేయిస్తున్నందుకు స్థానిక బస్తీ వాసులు కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఇందిరానగర్ లోని అన్ని వీధులు దాదాపుగా భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తిచేసి సిమెంట్ రోడ్లు కూడా వేయించామన్నారు. ఇందిరానగర్ మొదటి లెఫ్ట్ వీధి అలాగే ఇందిరానగర్ స్టార్టింగ్ లో పాడైన రోడ్డు స్థానంలో కూడా కొత్త సిమెంటు రోడ్లు తొందర్లోనే వేయిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు సాయి జెన్ శేఖర్, విఠల్ యాదవ్, కట్ట బుచ్చన్న గౌడ్, చంద్ర శేఖర్, ఆమీర్, జాకీర్, జానీ, అహ్మద్, వర్క్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.